దివ్యాంగులకు ప్రోత్సాహమేది?

- కమిటీల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్ల అనాసక్తి
- మండలంలో 1,106 మంది దివ్యాంగులు
- తమ గోడు వినేవారే లేరంటూ ఆవేదన



యాచారంలో నిరుపయోగంగా వికలాంగుల కమ్యూనిటీ భవనం

యాచారం: దివ్యాంగులకు ప్రోత్సాహం కరువైంది. సమాజంలో వారికి సరైన గుర్తింపు దక్కడం లేదు. తమ హక్కుల కోసం పోరాటం చేసేందుకు ఒకచోట సమావేశాలు నిర్వహిద్దామన్నా అందుకు తగిన వేదిక కరువైంది. ఐదేళ్ల కింద దివ్యాంగుల కోసం మండల స్థాయిలో ప్రత్యేక నిధుల బడ్జెట్ ఉండేది. డ్వాక్రా సంఘాల మాదిరిగానే దివ్యాంగులకూ కమిటీలు ఉండేవి. మహిళా సమాఖ్య పర్యవేక్షణలోనే దివ్యాంగుల సమావేశాలు, ఏర్పాటైన కమిటీలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించేవారు. రుణాల ద్వారా దివ్యాంగులు చిరు వ్యాపారాలు చేసుకుని జీవనోపాధి పొందుతూ, నెలనెలా అప్పు వాయిదాలు చెల్లించేవారు. ప్రతీనెల గ్రామస్థాయి, మండల స్థాయిల్లో సమావేశాలు నిర్వహించడంతో వారి బాధలు, ఇబ్బందులను అధికారులకు తెలియజేసుకునే వారు. బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు ఉపాధి పనుల్లో కూడా దివ్యాంగులకు వెసులుబాటు ఉంటుంది. ఉపాధి పనుల్లో తేలిక పాటి పనులు కల్పించడం, ప్రయాణ సౌకర్యాలు, బిల్లులు కూడా సకాలంలో వచ్చే విధంగా అవకాశం ఉంటుంది. అయితే గత కొన్నేళ్లుగా ఆయా సౌకర్యాలు గాని, ప్రోత్సాహం గాని దివ్యాంగులకు దక్కడం లేదు.

సంఘాల్లో ఉన్నది 256 మందే..

యాచారం మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లో ప్రతీనెల పింఛన్ పొందే దివ్యాంగులు 1,106 మంది ఉన్నారు. అయితే దివ్యాంగుల కమిటీలో మాత్రం 256 మంది మాత్రమే సభ్యులుగా ఉన్నారు. దాదాపు వందకు పైగా సంఘాలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 32 సంఘాలు మాత్రమే ఉన్నాయి. 32 సంఘాల్లోని దివ్యాంగులు కూడా గ్రామ మహిళా స్వయం సహాయక సంఘాల్లోనే భాగస్వామ్యంగా ఉంటూ రుణాలు పొందుతున్నారు. ఉన్న దివ్యాంగులకు కూడా మహిళా గ్రామ సంఘాలు తమ దయతోనే రుణాలు ఇప్పించే అవకాశం ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గతంలో రుణాలు పొందిన దివ్యాంగులు.. సకాలంలో అప్పులు చెల్లించకపోవడంతో పాటు మహిళా సంఘాలకు పెద్ద భారంగా మారారు. గతానుభవాల దృష్ట్యా దివ్యాంగులకు రుణాలు ఇప్పించాలంటేనే మహిళా సంఘాలు ఆసక్తి చూపడం లేదు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం

మండల పరిషత్ కార్యాలయ భవన సముదాయంలో వికలాంగుల కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా మారింది. పదేళ్ల కింద యాచారం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించాల్సిన వికలాంగుల కమ్యూనిటీ భవనాన్ని స్థలం కొరత వల్ల మండల పరిషత్ భవన సముదాయ పరిధిలో నిర్మించారు. జిల్లా పరిషత్(బీఆర్‌జీఎఫ్) నుంచి దాదాపు రూ.5 లక్షల నిధులతో 2016లో దీనిని నిర్మించారు. మొదట్లో ఈ భవనంలో మండల దివ్యాంగులు తరుచూ సమావేశాలు ఏర్పాటు చేసుకునే వారు. యాచారం గ్రామానికి దూరంగా ఉండటంతో గ్రామ దివ్యాంగులు ఈ భవనంకు రావడం లేదు. దీంతో కొన్నాళ్లుగా ఈ కమ్యూనిటీ భవనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకరావాలని దివ్యాంగులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ప్రభుత్వం దివ్యాంగుల ఆర్థిక ప్రగతి కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం లేదు. గ్రామ సంఘాల పరిధిలో పనిచేస్తున్న దివ్యాంగుల సంఘాలకు వారి దయతోనే రుణాలు ఇప్పించే పరిస్థితి ఉంది. మాకు కూడా సంఘాలు, ప్రత్యేక భవనం ఉంటే మా హక్కులు, మా ఆర్థిక ప్రగతి కోసం కృషి చేసుకుంటాం. మండలంలోని పలు గ్రామాల్లో ఎంతోమంది చిరు వ్యాపారాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

– వెంకటేష్, దివ్యాంగుడు, మల్కీజ్‌గూడ

త్వరలో కమిటీలు వేయిస్తాం



మండలంలోని దివ్యాంగులకు అండగా ఉంటా. ప్రభుత్వపరంగా ఏ సంక్షేమ పథకం మంజూరైనా ప్రాధాన్యత కింద వారికే కేటాయించేలా కృషి చేస్తా. దివ్యాంగులను ప్రోత్సహిస్తే స్వయం కృషితో ఆర్థిక ప్రగతి సాధిస్తారనే నమ్మకం ఉంది. అన్ని గ్రామాల్లో దివ్యాంగుల కమిటీలు ఏర్పాటు చేయిస్తాం. మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనాన్ని వాడకలోకి తెచ్చేందుకు కృషిచేస్తా.

– సుకన్య, ఎంపీపీ యాచారం

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి మార్చి 19వరకు ఎగ్జామ్స్
- ఏర్పాట్లను పూర్తిచేసిన అధికారులు



ఆమనగల్లు: తరగతి గదిలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు: ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ఆమనగల్లు పట్టణంలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రంలో ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రమీలమ్మ జూనియర్ కళాశాల, కడ్తాల మండల కేంద్రంలోని ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాల, బ్రిలియంట్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 390 మంది విద్యార్థులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 275 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమనగల్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య తెలిపారు. కళాశాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ బల్‌రాం నాయక్ తెలిపారు. పరీక్షా కేంద్రం సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష సమయంలో మూసి ఉంచాలని ఎస్ఐ కోరారు.

మంచాల మండలంలో..

మంచాల: నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తిచేశామని ఆ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 325, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 237 మంది మొత్తం 562 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

శంకరయ్యకు అండగా ఉంటాం



శంకరయ్యతో శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులు

శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైటర్ శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: శంకరయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైటర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బోడ శంకరయ్యకు రెండేళ్ల కితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి వికలాంగుడయ్యాడు. అప్పటినుంచి శంకరయ్య మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి.. శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైటర్ శ్రీనివాసు రెడ్డికి వివరించారు. స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్షా 20వేలు వెచ్చించి జైపూర్ నుంచి కృత్రిమ కాలు తెప్పించి వైద్యుల సహకారంతో శంకరయ్యకు అమర్చారు. ప్రస్తుతం శంకరయ్య కోలుకొని నడుస్తున్నాడు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి.. శంకరయ్యను కలిసి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని భరోసా పలికారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, జగ్గారెడ్డి, యాదయ్య, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కేశవరెడ్డి

తలకొండపల్లి: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగరావుపల్లి, రామకృష్ణాపురం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైటర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంగళవారం కేశవరెడ్డి ప్రారంభించారు. కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూర్ చేశారని.. ఆ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, మాజీ ఉప సర్పంచ్ మణికంఠ, సీనియర్ నేతలు జలంధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అచ్చిరెడ్డి, రాఘవరెడ్డి, జగ్గారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్ పాల్గొన్నారు.

రంగాపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

మంచాల: మండల పరిధిలోని రంగాపూర్‌లో సత్య సాయి సేవా ఫౌండేషన్ సహకారంతో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 43 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 210 గొర్రెలు, 85 పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అదే విధంగా 90 పశువులకు గోమారు నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంచాల, ఆరుట్ల పశు వైద్యశాలల వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ సుధారెడ్డి, సత్య సాయి సేవా ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ పొన్నయ్య, ఆరుట్ల వీఎల్ఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలందించాలి

ఎంపీపీ సుకన్య



స్టాఫ్‌నర్స్‌లతో ఎంపీపీ సుకన్య

యాచారం: వైద్య వృత్తి దేవుడిచ్చిన వరమని ప్రాణాలను కాపాడటం అంటే అది వైద్యులకే సాధ్యమవుతుందని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా 9మంది స్టాఫ్‌నర్స్‌లు వచ్చారు. వీరికి మంగళవారం ఆస్పత్రి కార్యాలయంలో స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ సుకన్య మాట్లాడుతూ.. వైద్య వృత్తిని గొప్పగా భావించాలని అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఈ ఆస్పత్రికి అనేక గ్రామాల నుంచి పేదలు వస్తారని మెరుగైన వైద్య సేవలు అందించి, నాణ్యమైన మందులు అందజేసే విధంగా కృషి చేయాలని కోరారు. వైద్యురాలు రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

వెంకటరమణారెడ్డికి సన్మానం



వెంకటరమణారెడ్డితో బీజేపీ నాయకులు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలలో నిర్వహిస్తున్న బీజేపీ విజయ సంకల్పయాత్రలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు మంగళవారం కలిశారు.బీజేపీ రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, జిల్లా ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధి లక్ష్మణ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలాల్ నాయక్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేశ్, నవీన్, శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్ నాయక్, రాందాస్ నాయక్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి



చిన్నారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన జిల్లెల చిన్నారెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజ్, నాయకులు దేవేందర్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణ్‌కు ఘన స్వాగతం



లక్ష్మణ్‌ను సత్కరించిన బీజేపీ నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో మంగళవారం జరిగే విజయసంకల్ప యాత్రకు వెళ్తున్న రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డా.లక్ష్మణ్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి నివాసంలో ఆయన కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు లక్ష్మణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్ సింగ్, శ్రీశైలం యాదవ్, శేఖర్, చెన్నకేశవులు, రవిరాథోడ్, ప్రశాంత్, మహేశ్, నరేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య తదితరులు ఉన్నారు.

పరామర్శ

మాడ్గుల: మంచాల మండలం ఆగాపల్లి గేటు సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొల్కులపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్ కుటుంబ సభ్యులను డీఈఓ సుశీందర్ రెడ్డి తదితరులు పరామర్శించారు. అంత్యక్రియల కోసం సాయం అందించారు. ఎంఈఓ సర్దార్‌నాయక్, కొల్కులపల్లి ఎంపీటీసీ సభ్యుడు బట్టు కిషన్‌రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు జంగయ్య, గోవర్ధన్‌యాదవ్, నాగేందర్ తదితరులు ఉన్నారు. అలాగే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులు వెంకటయ్య, లలిత, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, బాలనారాయణ, క్రూజర్ డ్రైవర్ శివను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ట్రోఫీ అందజేస్తున్న మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

కాంగ్రెస్ నేత అభిషేక్ రెడ్డి

మంచాల: క్రీడల్లో గెలుపోటముల సహజమని ఓడిపోయినప్పుడు కుంగిపోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. ఆరుట్లలోని వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.20వేలు(స్పాన్సర్ జయంత్ గౌడ్) యువసేన యూత్ గెలుచుకోగా.. రెండవ బహుమతి రూ.15వేలు (స్పాన్సర్ వెంకట రమణారెడ్డి) శ్రీరామ్ యూత్ గెలుచుకుంది. మూడవ బహుమతి రూ.10వేలు (స్పాన్సర్ చంద్రయ్య) పాండవ సేన–బి గెలుచుకోగా.. 4వ బహుమతి రూ.5వేలు (స్పాన్సర్ మార సురేష్) పాండవ సేన–ఏ టీం గెలుచుకుంది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.2,222 (స్పాన్సర్ ఎన్నుదుల సురేష్)జి.పవన్, బెస్ట్ బ్యాట్‌మెన్ గణేశ్, బెస్ట్ బౌలర్ అదిల్‌ని ఎంపిక చేశారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, స్థానిక నాయకులు మాసయ్య గౌడ్, హన్మంత్‌రెడ్డి, రాములు, భాషా, సుధాకర్, ఎల్లేశ్, రాజుగౌడ్, జంగయ్య గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇబ్రహీంపట్నం డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ ధరణికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 8 పీహెచ్‌సీలు, ఒక పీపీ యూనిట్ ద్వారా 63,204 మంది చిన్నారులకు టీకాలు వేస్తామన్నారు. 286 బూత్‌ల ద్వారా వీరికి చుక్కలు వేస్తామన్నారు. ఇప్పటికే 1,144 వాక్సినేటర్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇంటింటికి సర్వే చేయడానికి 572 బృందాలను వేశామని తెలిపారు. రూట్ సూపర్‌వైజర్లు 29 మంది, మొబైల్ టీంలు 10, ట్రాన్సిట్ పాయింట్ 6 గుర్తించామని తెలిపారు.

కంటి అద్దాల పంపిణీ

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎల్వీప్రసాద్ ఐ హాస్పిటల్, విజన్ భారత్ యూకే వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ.. జనవరి 30వ తేదీన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, ఈ రోజు అద్దాలను పంపిణీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయుడు జకీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఆశయ సాధనకు కృషి

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి



శ్రీశైలం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: నిజమైన దళితులకే రిజర్వేషన్లు అందాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద మంగళవారం ఎస్సీ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నె శ్రీశైలం జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. శ్రీశైలం ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు రమేశ్, మహేశ్, నిరంజన్, శ్రీకాంత్, రాజు, మల్లేశ్, జైహింద్, గౌతమ్, రామలింగం, మల్లేశ్, భరత్ విజయ్, బుచ్చన్న, గణేశ్, అమ్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆమనగల్లు: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్థానిక పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో హైస్కూల్‌లో జరిగిన స్వపరిపాలన దినోత్సవ వేడుకల్లో కలెక్టర్‌గా వైష్ణవి, ప్రిన్సిపాల్‌గా శ్రావిత, కరెస్పాండెంట్‌గా పూజ, డైరెక్టర్‌గా వినయ్, చైర్మన్‌గా శివ, ఆర్థికశాఖ మంత్రిగా స్నేహిత్, క్రీడా శాఖ మంత్రిగా మహేశ్, జాయింట్ కలెక్టర్‌గా శివకుమార్ వ్యవహరించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, కరెస్పాండెంట్ సుజాతారెడ్డి, డైరెక్టర్ సావిత్రి, అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆకుతోటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్వపరిపాలన దినోత్సవంలో డీఈఓగా జ్యోత్స్న, ఎంఈఓగా ప్రణవి, ప్రధానోపాధ్యాయురాలిగా ప్రేమలత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పాండు, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, ఉపాధ్యాయులు ప్రసన్న, బాలమణి, కృష్ణయ్య పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు



మెన్స్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టు గురించి ప్రదర్శన



హెల్తీ ఫుడ్-జంక్ ఫుడ్ గురించి..

ఆకట్టుకున్న సైన్స్ డే

అబ్బురపరిచిన చిన్నారుల ప్రదర్శనలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం వెంకటరమణ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆకట్టుకుంది. చంద్రయాన్, సోలార్ సిస్టం, ఫోటోసింతసిస్, జర్మినేషన్ సిగ్నలింగ్ సిస్టం, జంకుఫుడ్, సోషల్ మీడియా మొదలైన అంశాలపై విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. మండల విద్యాధికారి వెంకట్ రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేష్, ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు నర్సింహ, దీపిక ప్రదర్శనలను తిలకించారు. ఉత్తమ ప్రాజెక్టులు చేసిన విద్యార్థులను అభినందించారు. సైన్స్ ఫెయిర్లతో విద్యార్థుల టాలెంట్ బయటపడుతుందన్నారు. ఉపాధ్యాయులు సురేష్, బీరప్ప, ఆనంద్‌కుమార్, గోవర్ధన్, మహేశ్, హరిప్రసాద్ పాల్గొన్నారు .



నీటిని కాపాడాలని కోరే నమూనా



చెట్లను కాపాడాలని కోరుతున్న చిన్నారి